క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో అమ్మవారిని అర్చించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించి ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులకు జైలు.. జరిమానా

అల్లిపురం: మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మంది వాహన చోదకులకు నాల్గవ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి.నారాయణమూర్తి జైలు, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. హార్బర్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రైల్వేస్టేషన్, కాన్వెంట్ జంక్షన్ తదితర ముఖ్య కూడళ్లలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 20 మందిపై కేసులు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. ఈ మేరకు విచారణ చేపట్టిన మేజిస్ట్రేట్ మినీ బస్ డ్రైవర్ నారాయణరెడ్డికి, వ్యాన్ డ్రైవర్ అప్పలరాజుకు, బీకేస్‌కుమార్‌లకు మూడు నుంచి 15 రోజుల జైలు శిక్ష, రూ.10 వేల నుంచి రూ.20వేల చొప్పున జరిమానా విధించారు.

లయోలా హోంకు వృద్ధుల తరలింపు



హోంలో వృద్ధులను చేర్పిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: జాలరిపేటలో ఒక వృద్ధుడు (72)ను వన్‌టౌన్ సీఐ, ఏయూటీడీ సిబ్బంది కలిసి రెస్క్యూ చేశారు. ఇతను ఏమీ చెప్పలేక పోతున్నాడు. రెండో వ్యక్తి పేరు ఫిరపి (76)ను ద్వారక బస్ స్టేషన్లో గుర్తించారు. ఇతనిది విజయనగరం జిల్లా చీపురుపల్లి. మూడో వ్యక్తి పేరు టి.నాగరాజు (64). ఇతనిది భీమవరం. కూతురు, కొడుకు పెళ్లిళ్లు చేసి, ఉన్న ఆస్తులు ఇచ్చేసి వైజాగ్‌లో భిక్షాటన చేస్తుంటే 2019లో రెస్క్యూ చేశారు. మంచాన పడ్డ వీళ్ల కోసం కుటుంబ సభ్యులు రాకపోవడంతో సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు పెందుర్తిలో గల లయోలా హోంలో చేర్పించారు.

అగ్ని ప్రమాదంలో నాలుగు దుకాణాల దగ్ధం



కాలిపోయిన దుకాణాలు

మహారాణిపేట: బీచ్ రోడ్డు కొత్త జాలారిపేట వద్ద నాలుగు దుకాణాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. మూడు దుకాణాలు పూర్తిగా, ఒకటి 80 శాతం పైబడి కాలిపోయినట్టు మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ సబ్ కంట్రోల్ రూమ్‌కు కూత వేటు దూరంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదానికి కారణం అయిన ఒక మత్స్యకారుడిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒక ఇంజిన్, పలు వలలు, దుకాణంలో సామగ్రి కాలిపోయాయని అధికారులు వివరించారు. అగ్నిమాపక శకటాలు మంటలను అదుపు చేశాయి. మత్స్యశాఖ డెవలప్‌మెంటు ఆఫీసర్ ఆశ తదితరులు ఘటనా స్థలిని సందర్శించి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. సీహెచ్ వీర్రాజు, కె.బుజ్జి, వాడమోదుల మూర్తిరాజు, ఎ.చంటి దుకాణాలు కాలిపోయాయి. ఈ కేసును వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాకుల చెట్టు.. దీని శాస్త్రీయ నామం ఆల్‌స్టోనీయా స్కోలరీస్. నియోజకవర్గంలో ఈ చెట్లు అధికంగా కనిపిస్తున్నాయి. వీటిని ఎక్కువగా దెయ్యం చెట్లు అని పిలుస్తుంటారు. వీటి పుప్పొడి రేణువులు మానవాళికి అత్యంత ప్రమాదకరమని, శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా, అలర్జీ వంటివి వస్తుంటాయని, ఆ చెట్ల పుప్పొడి రేణువుల వల్ల చెట్టు కింద ఉండే వారికి స్పృహ కోల్పోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ చెట్లపై నియోజవర్గ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏడాకుల చెట్లు.. ఆరోగ్యానికి తూట్లు



యాతపేటలో ఏపుగా ఎదిగిన ఏడాకుల చెట్టు

- వ్యాధులకు కారణమవుతున్న వైనం
- అందం మాటున అనర్థం
- తక్షణం తొలగించాలని ప్రజల డిమాండ్



కెప్టెన్ రామారావు జంక్షన్ వద్ద ఏడాకుల చెట్టు

రుబ్బురోళ్ల వీధిలో పుష్పాలతో కళకళలాడుతున్న ఏడాకుల చెట్టు

అల్లిపురం: నియోజకవర్గంలో దాదాపు అన్ని వార్డుల్లో ఏడాకుల చెట్లు అధికంగా కనిపిస్తున్నాయి. హుద్‌హుద్ తుపాను సమయంలో చెట్లు పడిపోవటంతో పర్యావరణానికి ప్రమాదమని తెలిసి అప్పటి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు నగరంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాయి. దీంట్లో భాగంగా అధికంగా ఈ మొక్కలు కూడా నాటారు. అవి పెరిగి పెద్దవి కావటంతో ప్రస్తుతం అవి పూతకు వచ్చాయి. పువ్వులతో చూడచక్కగా ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. నలుగురు నిలుచునేందుకు నీడని ఇస్తున్నాయి. కానీ పువ్వు ముద్దొస్తుందని ముట్టుకున్నా, వాసన పీల్చినా, చెట్టు నుంచి వచ్చే గాలి పీల్చినా ప్రమాదం కొని తెచ్చుకున్నట్లే అని నిపుణులు చెబుతున్నారు. గిరిజనులైతే ఈ చెట్టు వైపు చూడ్డానికి, దానిని తాకడానికి కూడా భయపడుతుంటారు. ఆ చెట్టుపై దెయ్యాలుంటాయని వారు ప్రగాఢంగా నమ్ముతారు. శాస్త్రవేత్తల పరిశోధనల్లో ఈ చెట్టు ప్రమాదకారి అని తేలింది.

ఆరోగ్యంపై ప్రభావం..

నీళ్లు లేకపోయినా ఏపుగా, అత్యంత వేగంగా పెరిగే ఏడాకులు పాల చెట్లను దక్షిణ నియోజకవర్గంలోని రైల్వే క్వార్టర్స్, డీబీకే రైల్వే క్వార్టర్స్, సౌత్ జైలురోడ్డు, చావులమదుం, కెప్టెన్ రామారావు జంక్షన్, యాతపేట, జెండా చెట్టువీధి, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కళాశాల రోడ్డు, కేజీహెచ్, మహారాణిపేట, ఖానోజీనగర్, అంభోనీనగర్, జిల్లా పరిషత్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా నాటారు. ఈ పొడవైన చెట్టు బూడిదరంగు కాండం కలిగి, 7 ఆకులు ఒక గుత్తిగా ఉంటుంది. ఇప్పుడు అవి పూతకు వచ్చాయి. ఇవి వెదజల్లుతున్న పుప్పొడితో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ నుంచి ఫిబ్రవరికి నాలుగు, అయిదు మార్లు ఈ చెట్టుకున్న పువ్వులు పుష్పిస్తాయి. లక్షల కొద్దీ పుప్పొడిని బయటకు వెదజల్లుతాయి. పుప్పొడి రేణువులు వాతావరణంలో తేలియాడుతుంటాయి. గాలి ద్వారా మనుషుల శ్వాస కోశంలోకి ప్రవేశించి అలర్జీ, ఆస్తమా, ఊపిరితిత్తులు, కిడ్నీ, కంటి సమస్యలు సృష్టిసాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తక్షణం తొలగించాలి..



ఈ చెట్లు శీతాకాలంలో ఎక్కువగా పుష్పిస్తుంటాయి. డాబాగార్డెన్స్, అల్లిపురం ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా ఉన్నాయి. చూడ్డానికి అందంగా ఉంటాయి. కానీ శీతాకాలంలో వాటి నుంచి వచ్చే వాసన ఘాటుగా ఉంటుంది. దాని వలన ఆరోగ్యంపై ప్రభావం ఉంటుందని భయమేస్తుంది. జీవీఎంసీ అధికారులు వాటిని గుర్తించి తొలగిస్తే బాగుంటుంది.

–బూర్లి చిన్నా, బంగారుమెట్ట

చాలా చోట్ల ఉన్నాయి..



ఈ చెట్లు యాతపేట, కెప్టెన్ రామారావు జంక్షన్లలో అధికంగా ఉన్నాయి. చలికాలం కావటంతో పూలతో అందంగా కనిపిస్తున్నాయి. చెట్టు దగ్గరకు వెళ్తే అదోరకమైన ఘాటు వాసన వస్తుంది. ఆ వాసన పీలిస్తే అదోలా మత్తుగా ఉంటుంది. శ్వాస తీసుకోవడం కష్టంగా అనిపిస్తుంది. వీటిని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా ఇంకా కనిపిస్తున్నాయి.

–భీశెట్టి రాజు, అల్లిపురం

అధికారులు స్పందించాలి..



ఏడాకుల చెట్లపై జీవీఎంసీ అధికారులు స్పందించాలి. చలికాలం వస్తుందంటే చాలు భయమేస్తుంది. వాటి నుంచి వచ్చే వాసనకు తల తిరుగుంది. అదో రకమైన ఘాటు వాసనతో మత్తు ఆవహిస్తుంది. ముఖ్యంగా ఆస్తమా వంటి వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు వాటిని తొలగిస్తే బాగుంటుంది.

– బొడ్డేటి ప్రసాద్, వెంకటేశ్వరమెట్ట

నిరుపయోగంగా మొబైల్ బయో టాయిలెట్లు



నిరుపయోగంగా వదిలేసిన మొబైల్ బయో టాయిలెట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీకి, భారతీ ఆహార గిడ్డంగి రక్షణ గోడకు ఆనుకుని ఉన్న జీవీఎంసీ మొబైల్ బయో టాయిలెట్లను నిరుపయోగంగా వదిలేశారు. తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకున్న ఈ టాయిలెట్లు పిచ్చి మొక్కలు, దుర్గంధభరిత వాతావరణం నడుమ ఉండడంతో వీటిని కాలనీ నుంచి తరలించాలని శానిటరీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైగా వీటికి ఆనుకుని మంచినీటి వాటర్ ప్లాంటు ఉండడం, పరిసరాల నుంచి వచ్చే దుర్గంధం, దోమలు వాటర్ ప్లాంటులోకి చేరి మంచి నీరు కలుషితంగా మారుతుందని చెబుతున్నారు. అదే నీటిని అందరూ వినియోగిస్తున్నట్లు వాపోతున్నారు. దీని వల్ల రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు. గత నెలలో జ్ఞానాపురం ప్రాంతానికి చెందిన ఓ మహిళ డెంగ్యూతో మరణించింది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పలువురు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత జోనల్ కమిషనర్, పబ్లిక్ హెల్త్ అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

గ్యాంగ్ రేప్ నిందితులను శిక్షించాలని నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న ఏపీ మహిళా సమాఖ్య ప్రతినిధులు

అల్లిపురం: విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు సమాఖ్య ప్రతినిధులు అల్లిపురంలోని చలువతోటలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద తమ నిరసన తెలియజేశారు. సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. వనజాక్షి, ఎండీ బేగం మాట్లాడుతూ నిందితులు ఒక పథకం ప్రకారం విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా నిందితులని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాఖ్య ఉపాధ్యక్షురాలు ఎ. దేముడమ్మ, సభ్యులు బి.పుష్పలత, సీహెచ్ నూకాలమ్మ, భాను, కొండమ్మ, హేమలత, ముత్యాలమ్మ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

ఆదర్శ కార్మిక నేత 'కోలా'



కోలా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

డాబాగార్డెన్స్: ఆదర్శ కార్మిక నేత కోలా గురుమూర్తి స్ఫూర్తితో పోరాటాలు చేయాలని జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పడాల రమణ కోరారు. విశాఖ జిల్లా కార్మిక ఉద్యమ నిర్మాత, మున్సిపల్, మెడికల్, ఆర్టీసీ వంటి రంగాలతో పాటు అసంఘటిత రంగ కార్మికులైన రిక్షా, ముఠా, సినిమా హాల్స్, దుకాణాల్లో పనిచేసే కార్మికులను చైతన్యం చేసి అనేక హక్కులు సాధించిన కోలా గురుమూర్తి 32వ వర్ధంతిని పురస్కరించుకుని జీవీఎంసీ ప్రధాన ద్వారం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గురుమూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పడాల రమణ మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్మికుల వేతనాల పెంపు, ఎన్ఎంఆర్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత తదితర అనేక హక్కుల కోసం రాజీ లేని పోరాటాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోటా సత్తిబాబు, జీవీఎంసీ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు రాధాకృష్ణారెడ్డి, వీర్రాజు, అనిల్‌కుమార్, కె. సత్యనారాయణ, కోలా వాణి, లింగాల వెంకటేష్, కిలారి శివ, రమేష్, కొర్రయి రమేష్, భాస్కర్, సింహాచలం, బంగారయ్య, కరుణాకర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో అలసత్వం వద్దు




ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు

జగదాంబ: చెత్త సేకరణలో అలసత్వం వహించరాదని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు అన్నారు. బుధవారం ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది సమయానికి హాజరవ్వాలన్నారు. రహదారుల పక్కన చెత్త కుప్పలు లేకుండా ఎప్పటి చెత్త అప్పుడే ఎత్తి యార్డుకు తరలించాలన్నారు. క్లాప్ వాహనాల ద్వారా ఉదయం ఆరు గంటలకే చెత్త సేకరణ ప్రారంభం కావాలన్నారు. పారిశుధ్య సిబ్బంది రహదారులతో పాటు రోజూ కాలువలు కూడా పరిశుభ్రం చేయాలన్నారు. ప్రధాన కాలువల్లో చెత్తను బాబ్‌కట్, జేసీబీలతో ఎత్తించి, మురుగు నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా పరిశుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ల ప్రతిపాదన విరమించుకోవాలి

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసెంబ్లీలో మాట్లాడుతూ సంక్రాంతి పండగ నాటికి రోడ్లన్నీ బాగు చేస్తామని చెబుతూ.. ఇక మీదట జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర, జిల్లా స్థాయిలోని అన్ని ప్రధాన రోడ్లపైన టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించడాన్ని సీపీఎం విశాఖ జిల్లా కమిటీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. రోడ్ల నిర్వహణ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగిస్తామని, వారు టోల్ ఫీజులు వసూలు చేసుకుంటారని, అందుకు ప్రజల్ని ఒప్పించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదే అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టోల్ గేట్ల నిర్వహణ బాధ్యత తాము తీసుకుంటామని ఎమ్మెల్యేలు చేతులెత్తడం చూస్తుంటే వీరికి ప్రజల పట్ల ఎంత చిత్త శుద్ధి ఉందో అర్థమవుతుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇది సరిపోదు అన్నట్టు ఇప్పుడు రోడ్లపై టోల్‌గేట్లు పెట్టి ప్రజల వద్ద డబ్బులు వసూలు చేయాలని తుగ్లక్ పరిపాలన గుర్తుకు తెస్తున్నారని అన్నారు. తక్షణమే ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని, లేకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

24 గంటల్లోనే యువకుడి ఆచూకీ కనిపెట్టిన పోలీసులు



తల్లిదండ్రులకు యువకుడిని అప్పగిస్తున్న వన్‌టౌన్ పోలీసులు

డాబాగార్డెన్స్: ఇంటి నుంచి వెళ్లిపోయిన కుమారుడి ఆచూకీ కోసం తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి 24 గంటల్లోనే కుమారుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. వన్‌టౌన్ పోలీస్‌లు తెలిపిన వివరాలివి. ఉద్యోగం చేయడం లేదని తల్లిదండ్రుల మందలింపుతో ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడికి సంబంధించి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని, రైల్వే స్టేషన్ సమీపంలో ఆ యువకుడి ఆచూకీ గుర్తించి, 24 గంటల్లోపే తిరిగి తల్లిదండ్రులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. సకాలంలో యువకుడిని గుర్తించిన పోలీస్ సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అభినందించారు.

శానిటరీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

కంచరపాలెం: వరదలు సంభవించిన విజయవాడలో 41వ వార్డు నుంచి వెళ్లి సేవలందించిన శానిటేషన్ సిబ్బందికి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ బుధవారం దుస్తులు అందజేశారు. అనంతరం జ్ఞానాపురంలో గల వార్డు శానిటరీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రజల కోసం తమ ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా సేవలందించడం అభినందనీయమన్నారు. పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, అర్జున్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహా ప్రదర్శన విజయవంతానికి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్

డాబాగార్డెన్స్: వివిధ మార్కెట్లు, దుకాణాల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న ముఠా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని కోరుతూ ఈ నెల 26న చేపట్టనున్న మహా ప్రదర్శనలో విశాఖ జిల్లా ముఠా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. యూనియన్ నాయకుడు పైడిరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కుమార్ మాట్లాడారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న ముఠా కళాసీలకు ప్రభుత్వం నుంచి ఏ విధమైన చట్టపరమైన హక్కులు లేవన్నారు. వీరు పని చేస్తున్న సందర్భాల్లో ప్రమాదాలు జరిగి కాళ్లు, చేతులు విరిగిపోయినా, ప్రాణాలు కోల్పోయినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల నానాటికీ పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ రావడం వల్ల వీరు ఉపాధి కోల్పోతున్నారని, అలాగే ట్రాఫిక్ ఆంక్షల వల్ల గొడౌన్స్ నగర శివార్లకు వెళ్లిపోవడంతో ఇక్కడ ఉపాధి కోల్పోతున్నారని, కళాసీల మధ్య పనుల కోసం నిత్యం గొడవలు పడాల్సి వస్తుందన్నారు. ముఠా కార్మికుల రక్షణకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రోజు రోజుకీ నిత్యావసర ధరలు పెరగడం, ఆదాయాలు తగ్గడం, ఉపాధి కోల్పోవడం వల్ల కార్మికులు జీవించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు ఐక్యంగా చేస్తున్న పోరాటంలో ముఠా కార్మికులు కూడా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వై. రాజు, ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బారావు, వివిధ ముఠా జట్లకు సంబంధించిన మేస్త్రీలు రమణ, నర్సింగరావు, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థి చదువుకు వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: కార్పొరేట్ పాఠశాలలో చదువుతూ ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న ఓ మధ్య తరగతి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ బాసటగా నిలిచారు. ఫీజు కట్టలేదని స్కూల్‌కి ప్రవేశం ఇవ్వని ఆ పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. 39వ వార్డు కోటవీధికి చెందిన షేక్ కరిష్మా కుమారుడు షేక్ రెహాన్ బాషా నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నాడు. ఫీజు కట్టలేకపోవడంతో రెహాన్‌ను పాఠశాల యాజమాన్యం ప్రవేశం నిలుపుదల చేసింది. దీంతో అతని కుటుంబం వాసుపల్లి వద్దకు వచ్చి సమస్య వివరించింది. స్పందించిన ఆయన రూ.5 వేల ఆర్థిక సాయం అందజేయడమే కాక తిరిగి పాఠశాలలో విద్యనభ్యసించేలా యాజమాన్యంతో మాట్లాడారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ అన్ని దానాల్లో విద్యా దానం గొప్పదని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన అమ్మ ఒడి చదువు మధ్యలో ఆపేసే పేద విద్యార్థులను కూడా మళ్లీ పాఠశాలలకు వెళ్లే విధంగా మలిచిందని గుర్తు చేశారు. కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం పేదలకు అందించే ఏకైక నాయకుడు మహానేత రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎంఈవో పుష్పరాగం



నెహ్రూబజార్ గ్రంథాలయంలో మాట్లాడుతున్న గ్రంథాలయకర్త పద్మావతి

అల్లిపురం: గ్రంథాలయాలు విజ్ఞాన గనులు అని మండల విద్యాశాఖాధికారి బి.పుష్పరాగం అన్నారు. అల్లిపురం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన 57వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గత వారం రోజులుగా గ్రంథాలయం ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తకాలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. జిల్లా గ్రంథాయల సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీ నూకరాజు, పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

డాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్ దరి రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాల సోషల్ టీచర్ ఎస్. సంధ్యారాణి, ఆర్‌సీఎం పాఠశాల ప్రతినిధి ఏబీ జోషి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన..

సీతమ్మధార: విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకోవాలని వక్తలు కోరారు. నెహ్రూ బజార్ సమీపంలో గల ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లతో కాలం వృథా చేసే కన్నా పుస్తక పఠనంతో విజ్ఞానం సముపార్జించుకోవాలన్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర గ్రంథాలు కూడా తప్పనిసరిగా చదవాలని కోరారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత డీవీ సూర్యారావు, సాంబశివరాజు, గ్రంథాలయకర్త పద్మావతి, సిబ్బంది పైడిరాజు, పలు పాఠశాలలకు చెందిన 200 మంది వరకు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు బాలుడి అప్పగింత



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏఎస్ఐలు గణేష్‌బాబు, చంద్రశేఖర్

అల్లిపురం: తల్లి మందలించిందని ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన బాలుడిని హార్బర్ పోలీసులు తిరిగి అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. హార్బర్ ట్రాఫిక్ ఏఎస్ఐ గణేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం గాజువాక, పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన జస్వంత్ తన తల్లి మందలించిందని బుధవారం ఉదయం ఇంటి నుంచి పారిపోయి వచ్చాడు. చావులమదుం జక్షన్ సమీపంలో కన్వేయర్ బెల్ట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో అతన్ని పిలిపించి ఆరా తీశారు. దీంతో విషయం తెలుసుకున్న ఏఎస్ఐలు గణేష్‌బాబు, చంద్రశేఖర్, కానిస్టేబుల్ భాస్కరరావు బాలుడి తల్లికి ఫోన్ చేసి రప్పించి అప్పగించారు. ఉదయం నుంచి బాలుడి కోసం వెదుకుతున్నామని, తమ కుమారుడిని అప్పగించినందుకు వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సకాలంలో అర్జీలు పరిష్కరించాలి



జోనల్ అధికారులతో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు అన్నారు. బుధవారం ఆయన జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులపై జోనల్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిర్యాదుదారులు సంతృప్తి పొందేలా ఉద్యోగులు పని చేయాలన్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలు రికార్డు చేయాలన్నారు. ఒకసారి వచ్చిన అర్జీ మళ్లీ రాకుండా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ, పబ్లిక్ హెల్త్‌కు వచ్చిన ఫిర్యాదులను ఆయా వార్డులకు వెళ్లి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వోలు రతన్‌రాజు, అప్పలరాజు, ఏపీడీ పద్మావతి, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం కావాలి..

ఆస్తి, నీటి పన్ను వసూళ్లు వేగవంతం కావాలని జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. బుధవారం ఆయన సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సెక్రటరీలు, ట్యాక్స్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. వార్డుల్లో ఉన్న సచివాలయాల పరిధిలో సెక్రటరీలు, ఆర్ఐలు, సిబ్బంది ఆస్తి, నీటిపన్ను వసూలు చేయాలన్నారు. పాతబకాయిలు, మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. చెక్కులు కాకుండా కమిషనర్, జీవీఎంసీ పేరుతో డీడీలు తీసుకోవాలన్నారు. ఆర్‌వోలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సిరి వినాయక ఆలయ వార్షికోత్సవం



అల్లిపురం: నేరెళ్లకోనేరులో వెలసిన శ్రీ సిరి వినాయక ఆలయ 22వ వార్షికోత్సవం ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు ఉదయం స్వామికి విశేష అభిషేకాల అనంతరం తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 23వ తేదీన మహిళలతో కుంకుమార్చనలు, సహస్ర దీపాలంకరణ సేవ ఉంటాయన్నారు. 24వ తేదీన ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 25వ తేదీన మహా అన్న సమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.